కెమికల్ ట్యాంకులో పడి..

కవలలు దుర్మరణం

జీడిమెట్ల, అక్టోబర్ 16: మూత పడిన ఓ పరిశ్రమలో పునరుద్ధరణ పనులు చేస్తున్న ఇద్దరు (కవలలు) కార్మికులు కెమికల్ సంపులో పడి మృతి చెందారు. మరో కార్మికుడు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. జీడిమెట్ల డీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాము (32), లక్ష్మణ్ (32) కవల పిల్లలు. వీరు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గుండ్ల పోచంపల్లి అన్నారం గ్రామంలో ఉంటున్నారు. వీరిద్దరూ గత కొన్ని రోజులుగా సాధు నారాయణ ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్టర్ వద్ద రోజువారీ కూలీలుగా పనిచేశారు. గత నాలుగు రోజులుగా వీరిద్దరూ జీడిమెట్ల ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో మూడేండ్లుగా మూతపడి ఉన్న సాబూరి ఫార్మా పరిశ్రమలో ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్నారు. బుధవారం రాము, లక్ష్మణ్‌తో పాటు సురేందర్ రెడ్డి (40) పరిశ్రమలో ఉన్న వ్యాక్యూం ట్యాంకు గోడపై నిలబడి ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్నారు. టీ తాగడానికి గోడ దిగే క్రమంలో.. రాము ప్రమాదవశాత్తు వ్యాక్యూం ట్యాంకులో పడిపోయాడు. రామును రక్షించేందుకు లక్ష్మణ్ ట్యాంకులోకి దిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇద్దరు బయటకు రాకపోవడంతో.. సురేందర్ రెడ్డి ట్యాంకులోకి దిగి రాము, లక్ష్మణ్‌ను బయటకు తీశాడు. అనంతరం పరిశ్రమలో ఉన్న కొంత మంది సహాయంతో షాపూర్‌నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. సురేందర్ రెడ్డి కూడా అస్వస్థతకు గురి కావడంతో అదే దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మృతుల సోదరుడు సురేశ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆభరణాలు తీసుకొని.. డబ్బులు ఎగ్గొట్టి..

బంజారాహిల్స్: జ్యువెల్లరీ దుకాణంలో బంగారు ఆభరణాలు తీసుకొని డబ్బులు ఎగ్గొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఉత్కర్ష జ్యువెల్లర్స్‌లో నాంపల్లికి చెందిన శ్రీనాథ్ వ్యాస్ గతంలో రెండు, మూడు సార్లు డబ్బు లిచ్చి ఆభరణాలను కొనుగోలు చేశాడు. తాజాగా.. రెండు రోజుల కిందట రూ.15లక్షల విలువైన ఆభరణాలు కొనుగోలు చేసి.. డబ్బులు తర్వాత ఇస్తానంటూ చెప్పాడు. అతడి మాటలు నమ్మిన యజమాని ఆభరణాలు ఇచ్చాడు. డబ్బుల కోసం ఫోన్ చేయగా.. ముఖం చాటేశాడు. దీంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

శివారుల్లో వృద్ధ దంపతుల దారుణ హత్య

హంతకులెవరు.. దోపిడీ దొంగలా.? సైకోనా.?

వ్యవసాయ క్షేత్రంలో ఆధారం లేని మర్డర్స్

ఒంటరిగా ఉండే వారిలో భయాందోళన

సీసీ కెమెరాలు లేకపోవడంతో ముందుకుసాగని దర్యాప్తు.!

కందుకూరు, అక్టోబర్ 16: హైదరాబాద్ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. నిందితులు దోపిడీ దొంగలా..? ఇంటి దొంగలా..? సైకో పనా..? పోలీసులు ఎటూ తేల్చలేకపోతున్నారు. కందుకూరు మండల పరిధి, కొత్తగూడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఊశయ్య (70), భార్య శాంతమ్మ (65) దంపతులు. అదే గ్రామానికి చెందిన మనోహర్ రావుకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రానికి కాపాలాగా ఉంటున్నారు. ఈ వ్యవసాయ క్షేత్రం కందుకూరు మండలం పరిధిలోని కొత్తగూడ గ్రామంలో ఉన్నది. అక్కడున్న మామిడి తోటలోనే ఈ దంపతులు నివాసముంటున్నారు. చుట్టుపక్కల ఎవరూ ఉండరు. మంగళవారం రాత్రి దుండగులు శాంతమ్మను రూమ్‌లో హత్య చేసి, మామిడి తోటలోకి తీసికెళ్లి ఊశయ్యను హతమార్చారు. ఇదిలా ఉండగా.. మంగళవారం రాత్రి యజమాని ఆ వృద్ధ దంపతులకు ఫోన్ చేయగా.. మాట్లాడకపోవడంతో నిద్రిస్తున్నట్టు భావించాడు. బుధవారం తెల్లవారుజామున యజమాని స్థానికంగా తెలిసిన వాళ్లతో విషయం చెప్పి.. వ్యవసాయ క్షేత్రం వరకు వెళ్లిరమ్మని కోరాడు. సదరు వ్యక్తి అక్కడికి వెళ్లి చూడగా.. వృద్ధులు శవమై రక్తపు మడుగులో కనిపించారు. ఈ సమాచారాన్ని మనోహర్ రావుకు తెలపడంతో.. ఆయన పోలీసులకు సమాచారమిచ్చాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించారు. ఘటనా స్థలానికి ఎస్ ఓటీ డీసీపీ మురళీధర్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి చేరుకొని.. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హత్యకు గురైన వృద్ధ దంపతులు (ఫైల్)

హంతకులెవరు..?

ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆధారాల కోసం పోలీసులు భిన్న కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఒకపక్క మామిడి తోట.. మరోపక్క వరి చేను, మధ్యలో నీళ్లు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి డాగ్ స్క్వాడ్‌కు కూడా ఆధారాలు లభించలేదు. నిందితులు నీళ్లలో నుంచి పరారయ్యారా.? అనే అనుమానాలున్నాయి. ఈ వృద్ధులను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎవరైనా మద్యం మత్తులో అక్కడికి వెళ్లి వృద్ధులతో గొడవకు దిగారా.? దుండగులతో వృద్ధులు పెనుగులాడిన ఆనవాళ్లున్నాయి. వృద్ధురాలి గాజులు పగిలిపోయి ఉండటంతో పెనుగులాట జరిగినట్లు కనిపిస్తోంది. ఇటీవల ఒంటరిగా ఉండే వృద్ధులను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇప్పటికీ పోలీసులు కొన్ని కేసులను ఛేదించలేకపోయారు. శివారుల్లో సైకో తిరుగుతూ.. ఒంటరి వృద్ధులపై దాడులు చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. ఈ దారుణాన్ని కూడా సైకో చేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగులు చిన్నపాటి ఆధారం కూడా వదలకుండా అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలంలో లభించిన కొన్ని ఆధారాలతో దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు.

సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాధన రష్మి పెరుమాళ్

తప్పని సరిగా నిబంధనలు పాటించాలి

హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులతో డీసీపీ సాధన రష్మి పెరుమాళ్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 16: హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. బుధవారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో నార్త్ జోన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులతో డీసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. హోటల్స్, లాడ్జీలలో పెద్ద కార్యక్రమాలు, ఈవెంట్స్ జరిగిన సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. లాడ్జీలో బస చేసే వారి గుర్తింపు కార్డులను తప్పని సరిగా తీసుకోవాలన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా.. సీసీ కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల నిర్వాహకులు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా లాడ్జీ, హోటళ్ల యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇటీవల గోపాలపురం పీఎస్ పరిధిలోని రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న మెట్రో పోలీస్ హోటల్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వకుండా 151 మందితో నిర్వాహకులు వ్యక్తిత్వ వికాస శిక్షణా శిబిరాలు నిర్వహించారని గుర్తు చేశారు. నిర్వాహకులు నెల రోజుల పాటు 50 గదులు అద్దెకు తీసుకున్నారని వెల్లడించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న వ్యక్తి ఇటీవల కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలోని విగ్రహం ధ్వంసం కేసులో నిందితుడిగా గుర్తించినట్లు తెలిపారు. నిబంధనలు పాటించకపోవడంతో కేసు నమోదు చేయడంతో పాటు ఆ హోటల్ ట్రేడ్ లైసెన్స్ కూడా రద్దు చేయాలని సంబంధిత అధికారులను కోరడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఏసీపీలు గోపాలకృష్ణ, సుబ్బయ్య, రమేశ్, వివిధ పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అమర సైనికుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంసీఈఎంఈ లెఫ్టినెంట్ జనరల్ కల్నల్ నీరజ్ వర్ష్నే, 1ఈఎంఈ కమాండెంట్ బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాల్

భారతీయ రక్షణ దళంలో ఈఎంఈ పాత్ర కీలకం

ఎంసీఈఎంఈ లెఫ్టినెంట్ జనరల్ కల్నల్ నీరజ్ వర్ష్నే

బొల్లారం, అక్టోబర్16: భారతీయ రక్షణ దళంలో ఈఎంఈ కీలక పాత్ర పోషిస్తుందని మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ) కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ కల్నల్ నీరజ్ వర్ష్నే, 1ఈఎంఈ కమాండెంట్ బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాల్ అన్నారు. బుధవారం బొల్లారం 1ఈఎంఈ కేంద్రంలో 82వ ఈఎంఈ కార్ప్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంసీఈఎంఈ లెఫ్టినెంట్ జనరల్ కల్నల్ నీరజ్ వర్ష్నే, 1ఈఎంఈ కమాండెంట్ బ్రిగేడియర్ ప్రశాంత్ బాజ్‌పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్ మెమోరియల్ స్థూపం వద్ద దేశ రక్షణలో ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం ఎంసీఈఎంఈ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, ఈఎంఈ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిని పొందాలనే దురుద్దేశంతోనే..

బాలికను బలితీసుకున్నడు

కుటుంబం మొత్తాన్ని హత్య చేసేందుకు స్కెచ్

ఏడేండ్ల బాలిక హత్య కేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ

నిందితుడు తిరుపతి

దుండిగల్, అక్టోబర్16: తల్లిని పొందాలనే దురుద్దేశంతో ఓ దుర్మార్గుడు ఏడేండ్ల చిన్నారిని హత్య చేశాడు. సూరారం పీఎస్ పరిధిలో ఈ నెల 12న జరిగిన ఏడేండ్ల బాలిక హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేశారు. బుధవారం సూరారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభాకర్, సుమ దంపతుల కుటుంబం ఏడు నెలల కిందట నగరానికి వచ్చి, సూరారం కాలనీలోని జీవనజ్యోతినగర్‌లో ఉంటుంది. సుమ భర్త గతంలోనే రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ప్రభాకర్‌తో సహజీవనం చేస్తున్నది. ప్రభాకర్ కూలీగా, సుమ గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. స్వగ్రామానికి చెందిన అర్జున్ అనే వ్యక్తి ద్వారా తిరుపతి (31)అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తిరుపతి జీడిమెట్లలోని ఓ కంపెనీలో పనిచేస్తూ.. సూరారంకాలనీలోని దయానంద్‌నగర్‌లో తన భార్యతో కలిసి ఉంటున్నాడు. అయితే, సుమను మొదటి చూపులోనే ఇష్టపడిన తిరుపతి.. ఎలాగైనా ఆమెను శారీరకంగా అనుభవించాలనుకున్నాడు. ఇందుకోసం రోజూ సుమ, ప్రభాకర్ ఇంటికి వెళ్లి, మంచి చెడు మాట్లాడం మొదలుపెట్టాడు. ఏదైనా అవసరమున్నా సహకరించాడు. ప్రభాకర్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన బైక్‌పై తిప్పాడు. పిల్లలతోనూ చనువు పెంచుకోవడంతో వారు మామ అని పిలువడం మొదలుపెట్టారు. తనలో దాగి ఉన్న కోరికను తిరుపతి ఏనాడు వెల్లడించలేదు. సుమ తనకు దక్కాలంటే ప్రభాకర్‌తో సహా వారి ఇద్దరి పిల్లలను కడతేర్చాలనుకున్నాడు. ఇందుకోసం ఓ పదునైన కత్తిని కొనుగోలు చేసి ఇంట్లోనే దాచాడు. అవకాశం కోసం వేచిచూస్తున్నాడు. ఈ నెల 12న దసరా పండుగ రోజున మధ్యాహ్నం తిరుపతి సుమ ఇంటికి వెళ్లాడు. అరగంట పాటు మాట్లాడి తిరిగి తన ఇంటికి వెళ్తుండగా.. సుమ దంపతులు పెద్ద కుమార్తె జ్యోత్స్న (7) తిరుపతి ఇంటికి వెళ్తానని అడిగింది. దీంతో జ్యోత్స్నను తన బైక్‌పై కూర్చోబెట్టుకుని ఇంటికి తీసుకువెళ్లిన తిరుపతి.. సాయంత్రం బాలికను ఆమె ఇంటి వద్ద దింపాడు. అప్పటికే బాలికను చంపాలని నిర్ణయానికి వచ్చిన తిరుపతి.. కత్తిని ఎవరికీ తెలియకుండా బైక్ ట్యాంక్‌లో దాచాడు. ఆడుకుంటానని మీ అమ్మతో చెప్పి.. బయటకు రా..! నిన్ను బైక్‌పై కాలనీ అంతా తిప్పుతా..అని జ్యోత్స్నతో నమ్మబలికాడు. దీంతో బాలిక ఇంటికి వెళ్లగానే.. ఆడుకుంటానని చెప్పి.. బయటకు రాగానే వేచి ఉన్న తిరుపతి ఆమెను బైక్‌పై ఎక్కించుకుని ఎవరికంటా పడకుండా మేడ్చల్ వైపు తీసుకువెళ్లాడు. రాత్రి 7 గంటల వరకు బాసర ఘడ్ రోడ్డులో జనసంచారం లేనిచోట బైక్‌ను నిలిపివేశాడు. ఆందోళనగా చూస్తున్న బాలిక నోరును ఓ చేతితో మూసి వేసిన తిరుపతి.. కత్తితో గొంతుకోసి, ఆపై కడుపులో పలుమార్లు పొడిచి కిరాతకంగా హత మార్చాడు. ఆ తర్వాత శవాన్ని ఓ సిమెంట్ సంచిలో కుక్కి, బండరాయి చాటున వదిలి తిరిగి తన ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు ఆమె కోసం వెతుకుతుండటం గమనించి, తనకేమీ తెలియనట్టు వారితో కలిసి అదే రోజు సూరారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

గోనె సంచిలో బాలిక శవం

మంగళవారం ఉదయం బాసర గడి గ్రామంలోని నిర్జన ప్రదేశంలో ఓ గోనె సంచిలో బాలిక శవం ఉందంటూ సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు.. బాలిక జ్యోత్స్న మృతదేహంగా గుర్తించారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు.. సూరారం కాలనీలోని సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. నిందితుడు తిరుపతి తన బైక్‌పై జ్యోత్స్నను తీసుకెళ్లినట్టు నిర్ధారించుకుని అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. బాలికను తానే హత్య చేసినట్టు అంగీకరించాడు. పైగా బాలిక తండ్రి ప్రభాకర్‌తో పాటు చెల్లెల్ని కూడా హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలపడంతో పోలీసులు షాక్ తిన్నారు. కేవలం ఒక మహిళను పొందెందుకు ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టిన నిందితుడు తిరుపతిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు.

తాత గొంతుతో మనవడికి ఫోన్

రూ.50వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

బంజారాహిల్స్, అక్టోబర్ 16: విదేశాల్లో ఉన్న తాత గొంతును అనుకరిస్తూ ఓ యువకుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసిన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎమ్మెల్యే కాలనీలోని లోటస్ పాండ్ సమీపంలో వంశీరామ్ జ్యోతి లోటస్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న స్వితేష్ తాతినేని అనే యువకుడికి మంగళవారం మధ్యాహ్నం అమెరికా నంబర్ నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి స్వితేష్ తాతయ్య గొంతుతో మాట్లాడుతూ.. అర్జెంట్‌గా రూ.50 వేలు ఓ నంబర్‌కు పంపించాలని, తనకు ఇంటర్ నెట్ సరిగా రావడం లేదని చెప్పాడు. అమెరికాలో ఉన్న తన తాతే కాల్ చేశాడని భావించిన స్వితేష్.. అవతలి వ్యక్తి సూచించిన నంబర్‌కు రూ.50వేలు పంపించాడు. కొంతసేపటి తర్వాత అదే నంబర్ నుంచి కాల్ చేసిన వ్యక్తి.. బిగ్గరగా నవ్వడంతో తాత గొంతు కాదని గుర్తించాడు. దీంతో అప్రమత్తమైన స్వితేష్ తన తాతకు కాల్ చేసి తెలుసుకోగా.. తాను ఫోన్ చేయలేదని చెప్పాడు. దీంతో సైబర్ నేరగాళ్లు తనను మోసం చేసినట్లు గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైం హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు మంగళవారం రాత్రి ఫిలింనగర్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రిపోర్టర్ గౌతంగౌడ్‌కు బెయిల్

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిని అవమాన పరిచే విధంగా సామాజిక మాధ్యమం వేదికగా పోస్టులు పెట్టినట్టు సైబర్‌క్రైం పోలీసులు నమోదు చేసిన కేసులో రిపోర్టర్ గౌతంగౌడ్‌కు 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. రూ.10వేల చొప్పున ఇద్దరి పూచీకత్తుపై జమానత్‌లను న్యాయవాది లక్ష్మణ్ కోర్టుకు సమర్పించారు. విడుదల పత్రం అందిన పిదప చంచల్‌గూడ జైలు అధికారులు నిందితుడిని విడుదల చేశారు. రాజకీయ ఒత్తిడి పెంచే విధంగా వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు నిందితుడిపై కేసు నమోదు చేశారు. సెక్షన్లు 353(1), 353 (2), 352, 336 (4), 351(4), 196తో పాటు 67 ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. 18 రోజుల పాటు జైలులో ఉన్న నిందితుడికి ఎట్టకేలకు బెయిల్‌ను మంజూరు చేస్తూ కోర్టు ఆదేశించింది. సీఎంపై అనుచిత వ్యాఖ్యలను పోస్టు చేసినట్టు నిందితుడిపై ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఇతర పోలీసు స్టేషన్లలో కూడా కేసులు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తిమృతి

మారేడ్‌పల్లి, అక్టోబర్ 16: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడటంతో గుర్తుతెలియని వ్యక్తిమృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి– బొల్లారం రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా ఓ వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు సూమారు 55–60 ఏండ్లు ఉంటాయని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నిర్మాణం పేరుతో బురిడీ

బిల్డర్స్‌పై చీటింగ్ కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 16: ఇంటి నిర్మాణం చేస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిన నిర్మాణ సంస్థపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలిలోని టీఎన్‌జీవో కాలనీలో నివాసముంటున్న ఫజల్ అహ్మద్ ప్రైవేట్ ఉద్యోగి. అతడి కుమారుడు అఫ్జల్‌అహ్మద్ పేరుతో ఉన్న 167 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు బెంగళూరుకు చెందిన ఆల్ అబౌంట్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను సంప్రదించారు. బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని ప్లోరా అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న బ్రాంచ్ కార్యాలయంలో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు సూచించారు. దీంతో సంస్థ హైదరాబాద్ డైరెక్టర్ షణ్ముక్ మలిశెట్టి కృష్ణవరుణ్‌ను కలిశారు. సంస్థ పేరుతో చెక్ ద్వారా రూ.5.70 లక్షలు, కృష్ణ వరుణ్ అకౌంటుకు రూ.5.70 లక్షలతో పాటు లేబర్ చార్జీల కింద రూ.85 వేలు ఫజల్ అహ్మద్ చెల్లించాడు. అయితే, ఏడాదిన్నర దాటినా ఇంటి నిర్మాణం ప్రారంభించలేదు. తీసుకున్న డబ్బు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో ఫజల్ అహ్మద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ కృష్ణ వరుణ్, సీఈవో ప్రియదర్శి మిశ్రా, వరుణ్ రాజ్ గౌడ, గుణశేఖరన్, తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తనతో పాటు మరికొంత మందిని కూడా ఆల్ అబౌట్ బిల్డర్స్ సంస్థ నిర్వాహకులు మోసం చేసి, లక్షలాది రూపాయలు వసూలు చేశారంటూ బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చిన్నారిని తరిమిన వీధికుక్క

భయంతో పరుగు.. గాయం



దుండిగల్, అక్టోబర్16: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. చిన్నారులు కనిపిస్తే చాలు.. కాటు వేస్తామనే రీతిలో దాడులకు తెగబడుతున్నాయి. ఇటీవల బౌరంపేటలో పాలప్యాకేట్ కోసం కిరాణా దుకాణం వెళ్తున్న బాలుడితో పాటు దసరా పండుగ రోజు తండ్రి, కొడుకులపై దాడిచేసి గాయపర్చాయి. ఈ ఘటనలు మరువక ముందే దుండిగల్ గ్రామంలో ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారిపై ఓ వీధి కుక్క దాడికి దిగింది. దీంతో భయంతో పరుగెత్తిన చిన్నారి రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. దుండిగల్ వీలేజ్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన కృష్ణవేణి, మధు దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు. పిల్లలను సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. బుధవారం సాయంత్రం 3.30 గంటల సమయంలో తరగతులు ముగియడంతో పాఠశాల నుంచి పిల్లలిద్దరిని తీసుకుని.. తల్లి కృష్ణవేణి ఇంటికి వెళ్తున్నది. ఓ వీధికుక్క వీరి వెంట పడింది. దీంతో, ఎల్‌కేజీ చదువుతున్న నాలుగేండ్ల అక్షిత భయంతో పరిగెడుతూ రోడ్డుపై పడిపోవడంతో నుదుటిపై గాయమైంది. గమనించిన స్థానికులు కుక్కను అక్కడి నుంచి తరిమేశారు. గాయపడిన అక్షితను కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించి.. చికిత్స చేయిస్తున్నారు.

నాలాలో పడిన వ్యక్తిని కాపాడిన డీఆర్ఎఫ్ బృందం

సిటీబ్యూరో, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్ పరిసరాల్లోని లీలానగర్ నాలాలో పడిపోయిన ఓ వ్యక్తిని హైడ్రా రెస్క్యూ టీమ్ కాపాడింది. బుధవారం తెల్లవారుజామున నాలాలో బానోత్ స్వామి(45) పడిపోయాడు. స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే డీఆర్ఎఫ్‌కు సమాచారమివ్వడంతో.. ఖైరతాబాద్ జోన్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు తన బృందంతో ఘటనా స్థలానికి చేరుకొని.. స్వామిని కాపాడారు. చలిలో వణుకుతున్న స్వామికి పొడి దుస్తులు ఇచ్చి.. అల్పాహారం అందించారు. అనంతరం ఆస్పత్రిలో చూపించి, వృద్ధాశ్రమంలో చేర్పించట్లు ఎస్ఎఫ్ఓ మోహన్‌రావు తెలిపారు.

నాలాలో పడిపోయిన స్వామిని కాపాడిన రెస్క్యూ టీమ్

గ్రేటర్‌లో పలు చోట్ల వర్షం

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి వాన కురిసింది. రాత్రి 9గంటల వరకు పటాన్‌చెరులో 1.35సెం.మీ, లింగంపల్లిలో 1.18సెం.మీ, కుత్బుల్లాపూర్‌లోని మహదేవ్‌పురంలో 1.10సెం.మీ, ముషీరాబాద్‌లో 1.0సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. వాయుగుండం కొనసాగుతుండడంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.8 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.3 డిగ్రీలు, గాలిలో తేమ 69 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★KS పెస్ట్ కంట్రోల్ టెర్మిట్: 10 సం।।ల గ్యారంటీ, చెదలు, బొద్దింకలు, నల్లులు, బల్లులు, కిచెన్ జెల్ రీజనబుల్ ధరల్లో. 9494914020, 8686101598. NT-335089

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-335088

**BUSINES